ప్రజాశక్తి
శనివారం 21 జూన్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

'కేంద్రీయ' విద్యార్థులకు..

'తల్లికి వందనం' లేనట్లేనా..?

- జిల్లాలో వెయ్యి మందికి నిలిపివేత
- రాష్ట్ర ప్రభుత్వ విధానమే కారణమంటున్న తల్లులు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత వైఖరి కారణంగా కేంద్రీయ విద్యాలయాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు తల్లికి వందనం పథకం అమలు కాలేదు. జిల్లా పరిధిలోని ఒంగోలు, పశ్చిమ ప్రకాశంలోని రాజుపాలెం (మార్కాపురం) కేంద్రీయ విద్యా సంస్థల్లో చదువుతున్న సుమారు వెయ్యి మందికి ఈ పథకం అమలు కాలేదు. ఒంగోలు లో సుమారు 700 మంది, రాజుపాలెంలో సుమారు 300 మంది తల్లికి వందనం పథకానికి నోచుకోలేదు. ఈ విషయమై ఒంగోలు విద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల తల్లులు కేంద్రీయ విద్యాలయం వద్ద ఇటీవల నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న జడ్‌పి సిఇఒ, ఎంఇఒ, ఇతర అధికారులు అక్కడకు చేరుకొని తల్లికి వందనం పథకం రాష్ట్ర పరిధిలోని దని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా సంస్థకు రాష్ట్ర ప్రమేయం లేదని వారికి నచ్చ చెప్పారు.

అమ్మఒడి అమలు అయినపుడు తల్లికి వందనం అమలు కాదా..?

గత ఏడాది కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు అమ్మ ఒడి పథకం అమలు చేశారు. విద్యార్థుల తల్లుల బ్యాంకు ▶ 2లో



హామీలు.. ఇంకెత కాలం..

- ఆరులో రెండు ఆచరణలోకి
- మిగతా నాలుగు కోసం నిరీక్షణ
- జిల్లాలో ఇచ్చిన హామీల అమలుపై జనంలో నిరుత్సాహం
- కూటమి సర్కారు పాలన తీరూ తెన్నూ ఇదీ..



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

కూటమి ప్రభుత్వ పాలన రెండో ఏడాదిలోకి అడుగుపడింది. పాలనపై పలు రకాల విశ్లేషణలు సాగుతున్నాయి. విధ్వంసపాలన నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామంటూ పాలకపక్ష నేతలు ఒకటే ఊదరగొడుతున్నారు. ఏడాదిలోపు గాడిలో పడిందా? ఇచ్చిన హామీలు అమలు చేశారా? ప్రజల్లో ఎలాంటి స్పందన ఉందనేదానిపై ఇప్పటికే పలు అభిప్రాయాలు వెలుగుచూశాయి. ఏడాదిలో ఏంజరిగిందో జనం కన్నా పాలకపక్ష నేతలకే బాగా తెలుసు. ఎక్కువ శాతం మందిలో పెదవి విరుపే కనిపిస్తోంది. ప్రభుత్వంపైనా, పాలకపక్ష మంత్రులు, ఎమ్మెల్యేలపైనా నిర్వహించిన సర్వేల్లోనూ ప్రజాభిప్రాయం మాత్రం పూర్తిస్థాయిలో సంతృప్తిగా లేదన్నది వాస్తవం. ఎందుకిలా జరిగిందనేదాన్ని పరిశీలిస్తే ప్రధానంగా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలోనే నిర్లిప్తత కొనసాగుతోంది. గత దీపావళి సమయంలో ఏడాదికి మూడు ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేశారు. మొన్న తల్లికి వందనం కింద నగదు వేశారు. సూపర్‌సిక్స్‌లో ఇప్పటికీ అమలు చేసింది రెండు పథకాలే. మిగతా నాలుగు ఎప్పుడా ఎప్పుడా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. అమలు చేసే వరకూ నిరీక్షణ తప్పదు. ఇవి రాష్ట్రస్థాయిలో మేనిఫెస్టో పేరుతో ప్రజలకు కూటమి ఇచ్చిన హామీలుగా ఉనాయి. ఇక జిల్లాలోనూ, నియోజకవర్గాల్లో అనేకం ఉన్నాయి. వాటిపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఏ ఒక్కటీ అమలు చేయనందునే ప్రజాప్రతినిధులపైనా, ప్రభుత్వంపైనా అసంతృప్తి పెరగడానికి కారణాలుగా విశ్లేషిస్తున్నారు. ఈ అసంతృప్తి ఒక స్థాయి దాటితే ఎంత ఇచ్చినా ప్రయోజనం లేదనే చర్చ పాలకపక్ష శ్రేణుల్లోనే వినిపిస్తోంది. మార్కాపురం జిల్లా ఏర్పాటు పెద్ద ఆర్థిక వ్యవహారం కూడా కాదు. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు ఆనాడు చంద్రబాబు ప్రతిపక్షనేతగా హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే అనేక డిమాండ్లు ఉన్నాయంటూ కాలయాపన చేస్తున్నారు. ఆ డిమాండ్లు ఆనాడూ ఉన్నాయి.వాటిపై పార్టీకి ఓ స్పష్టత ఉంది. ఇచ్చిన హామీ అమలు చేశారా?లేక అనేక చోట్ల ఇలాంటివి ఉన్నందున పక్కనబెడతామంటే ఇక్కడ జనంలో అసంతృప్తి రాకుండా ఉంటుందా? అనేది ఆలోచించాలి. ఎమ్మెల్యేలు కూడా ఏమీ మాట్లాడలేక పోతున్నారు. నష్టం జరుగుతుందని ▶ 2లో

భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి


- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- సర్టిఫికెట్లు, అర్జీల పరిష్కారానికి చర్యలు
- ఘనంగా రెవెన్యూ దినోత్సవం



ఆర్‌డిఒకు కేక్ తినిపిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో భూ సమస్యలు, వివిధ సర్టిఫికెట్ల వచ్చే అర్జీపై రెవెన్యూ శాఖ అధికారులు ప్రత్యేక దష్టి సారించి సత్వరం పరిష్కరించి శాఖకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని మినీ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ మినీ స్టేడియం వద్ద నుంచి కలెక్టరేట్ వరకూ కొనసాగింది. అనంతరం ఒంగోలు కలెక్టరేట్ లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన రెవెన్యూ దినోత్సవ వేడుకలలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై రెవెన్యూ అధికారులతో కలిసి కేక్ ను కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి రెవెన్యూ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకూ రెవెన్యూ శాఖ ఇతర శాఖలకు ఆదర్శంగా ఉందని, రానున్న రోజుల్లో ఇతర శాఖలకు రెవెన్యూ శాఖ ఆదర్శంగా నిలవాలన్నారు. భూ సమస్యలపై, సర్టిఫికెట్స్ కోసం పేద ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు అర్జీలతో వస్తుంటారని, క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారులు వారి సమస్యలను సావధానంగా విని సత్వరం పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు పనిచేసినప్పుడే ప్రజల్లో రెవెన్యూ శాఖపై నమ్మకం పెరుగుతుందన్నారు. రెవెన్యూశాఖలో ఉత్తమ సేవలందించిన రెవెన్యూ ఉద్యోగులు, ఉదోగ్య విరమణ చెందిన ఉద్యోగులను ఈ సందర్భంగా కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించి బుక్స్, రికార్డ్స్ తో ఏర్పాటు చేసిన స్టాల్‌ను జిల్లా కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ వేడుకల్లో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు ఒంగోలు ఆర్‌డిఒ కె.లక్ష్మీ ప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, పార్థసారథి, ఎపిఆర్‌ఎస్‌ఎ జిల్లా అధ్యక్షుడు పిన్నిక మధుసూదనరావు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

తీరంలో ఉద్రిక్తత

వివాదాస్పద భూమిలోకి ప్రవేశించరాదని కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

వివాదాస్పద భూమిలోకి ఎవరూ ప్రవేశించ రాదంటూ జిల్లా వెంకట మురళి ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల జిల్లా చీరాల-బాపట్ల సరిహద్దులోని వాడరేవు,విజయలక్ష్మీ పురం గ్రామాల మధ్య ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి, మత్స్యకారుల మధ్య నెలకొన్న వివాదం శుక్రవారం ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. దీంతో బాపట్ల మండలం అడవి రెవెన్యూ పంచాయతీలోని సర్వేనెంబర్ 499-1,2 లోని 3.50 ఎకరాల వివాదాస్పద భూమిలోకి ఎవరూ ప్రవేశించరాంటూ కల్టెర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ భూమిపై బిఎన్‌ఎస్ 163 యాక్ట్ అమలు చేశామని తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ భూమిలోకి ఎవరూ వెళ్లకూడదని తెలిపారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని చీరాల, బాపట్ల ఆర్‌డిఒలను కలెక్టర్ ఆదేశించారు.



ఆందోళన కారులతో మాట్లాడుతున్న డిఎస్‌పి రామాంజనేయులు

చీరాల మండలం వాడరేవు, విజయ లక్ష్మీపురం గ్రామాల మధ్య ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ ఉంది. చీరాల ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు సముద్రంలో కలిసే విధంగా ఈ కాలువను గతంలో నిర్మించారు.కాలువ సముద్రంలో కలిసే చోట తూర్పు వైపు భూములు ఉన్న బుర్ల వెంకట్రావు అనే వ్యక్తి కాలువ సముద్రం కలిసే చోట ఉన్న సీమౌత్‌ను చదును చేశాడు. దీంతో వివాదం చెలరేగింది. సీమౌత్ మూసివేసి, ఇసుక దిబ్బలను చదును చేసిన వెంకటరావు పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, సీమౌత్ పునరుద్ధరించాలని మత్స్యకార, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలనాయకులు డిమాండ్ చేశారు.

సముద్ర తీర ప్రాంతంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ పరిధిని విస్మరించి రీసార్ట్స్‌లు నిర్మించారంటూ బుర్ల వెంకటరావు కు చెందిన రిసార్ట్ వద్ద మత్స్యకారులు శుక్రవారం ఆందోళనకు దిగారు. మత్స్యకార సంఘాలు, ప్రజా సంఘాలు, వివిధ ▶ 2లో

హామీలు.. ఇంకెంత కాలం..

(మొదటిపేజీ తరువాయి)

గ్రహించినా అచేతన స్థితిలోనే ఉన్నారు. మరో కీలక ఎజండా వెలిగొండ ప్రాజెక్టు. దీన్ని ఏడాదిలో పూర్తిచేస్తామని ప్రకటించారు.తర్వాత రెండేళ్ల కుమార్చారు. ఇపుడు దాన్ని పూర్తిచేస్తారా? లేదా? అనేదీ సంశయనంగానే ఉంది. ఎందు కంటే జరగాల్సిన పనులు చాలా ఉన్నాయి. ప్యాకేజీలకు భారీగా కేటాయింపులు జరగాలి. ఇప్పటికీ 60 శాతం నిధులే ఇచ్చారు. ఇంకా 40 శాతం నిధులు విడుదల చేయాలి. పనులు చేపట్టి పూర్తిచేయాలి. ఇదే ఇపుడు పెద్ద సందిగ్ధంగా మారింది. రాను న్న నాలుగేళ్లలోనైనా పూర్తవుతుందా?అంటే నమ్మకం కలుగడం లేదు. దీన్ని ఎవరూ సీరియస్‌గా తీసుకోవడం లేదు. పశ్చిమాన దీని ప్రభావం కీలకంగా ఉండనుంది. జిల్లా డెయిరీ మూతపడే ఉంది. దీన్ని తెరిపించేయత్నాలు కనిపించడం లేదు. ఎన్‌డిడిబి తోనూ చర్చలు చేయాల్సి ఉంది. జిల్లా డెయిరీని ప్రారంభిస్తే ప్రైవేటు డెయిరీలకు నష్టం కలుగుతుంది.ఏ వైపు పాలకపక్షం ఆలోచిస్తుందో చూడాలి.ఇంకా ప్రకాశం విశ్వవిద్యాలయం పనులు ముందుకు సాగలేదు. ట్రిపుల్‌ఐటీ కాలేజీ నిర్మాణం ఆగిపోయింది. ఒంగోలు, కనిగిరి తదితర ప్రాంతాల్లో టిట్కో ఇళ్ల నిర్మాణం ఎప్పటిలాగే ఉంది. ఏడాదిలో ఏమీ జరగలేదు. లబ్ధిదారులకు అప్పగించే యత్నాలు కనిపించడం లేదు. మరోవైపు ఒంగోలులో ఎన్నికల ముందు పట్టాలు పంపిణీ చేశారు. ఇపుడు వాటిని రెండు సెంట్లకు పెంచి ఇస్తామని ఎమ్మెల్యే దామచర్ల హామీ ఉంది. ఇది కూడా ముందుకు సాగడం లేదు. అనేక ప్రాంతాల్లో పేదలు ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారు.గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఇవన్నీ వేగంగా నడిచేలా లేవు. సమీక్షలు కొరవడ్డాయి. నిధులు కేటాయింపుల్లో నిర్లిప్తత నడుస్తోంది. తాగునీటి పథకాలకు తయారు చేసిన ప్రతిపాదనలూ ప్రశ్నార్థకంగా మారాయి. నియోజకవర్గాల్లో ఎన్నికల సమయంలో కూటమి అభ్యర్థులు ఇచ్చిన హామీలు ఏమీ అమలు ఇంకా మొదలు కాలేదు. ఎయిర్‌పోర్టులు, పోర్టులు, హార్బర్లు, పారిశ్రామిక వాడలు అన్నీ మాటల్లోనే ఉన్నాయి. కాగితాలపైనే కాలయాపనలో చాలా వరకూ ఉన్నాయి. ఏదేమైనా ఎంత చేశామనే దానికన్నా ఎంతో కొంత ఆచరణ కీలకమని కూటమి నేతలు గుర్తించాల్సి ఉంది.

కేంద్రీయ విద్యార్థులకు..
'తల్లికి వందనం' లేనట్లేనా..?

(మొదటిపేజీ తరువాయి)

ఖాతాల్లో నగదు జమ చేశారు. ఇప్పుడు తల్లికి వందనం ఎందుకు అమలు చేయరని విద్యార్థుల తల్లులు ప్రశ్నించడంతో విద్యా శాఖాధికారులు తలలు పట్టుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం అమ్మ ఒడి, పథకంతో పాటు నాడు - నేడు పథకం అమలు కోసం ప్రత్యేకమైన యాప్ రూపొందించింది. విద్యార్థుల అటెండెన్స్, మధ్యాహ్న భోజనం అమలు, తరగతులు నిర్వహణ తదితర డేటాను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేశారు.ఉపాధ్యాయులు, విద్యార్థుల అటెండెన్స్, అన్ని మేనేజ్ మెంట్లకు చెందిన వివరాలు విద్యాశాఖ అధికారులు నేరుగా పర్యవేక్షించేవారు. ఏదయినా ఒక పాఠశాలలో అటెండెన్స్ యాప్ లో అప్ లోడ్ చేయకుంటే ఆ పరిధిలోని ఎంఇఒలు అడిగి మరీ అటెండెన్స్ తెప్పించుకునేవారు. గత ప్రభుత్వం యుడైస్ వివరాలు, ఈ యాప్ ద్వారా విద్యార్థుల అటెండెన్స్ ను పరిగణలోకి తీసుకోని కేంద్రీయ విద్యాలయాల్లో **అమ్మ ఒడి పథకం అమలు చేసింది.**

విద్యార్థుల డేటా సేకరణ భాధ్యత ఎవరిదీ..?

జిల్లాలోని రెండు కేంద్రీయ విద్యాలయాలకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జడ్‌పి సిఇఒ కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. కేంద్ర సిలబస్ అమలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పలు కార్యకలాపాలు అమలు చేయడం ఆనవాయితీ. ఈ విద్యాలయాల్లో సీట్లు దాదాపు ఈ జిల్లావాసులకే కేటాయిస్తారు. విద్యా శాఖ అమలు చేసే యుడైస్ కూడా అమలు అవుతుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం ఎన్నికల హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలులో చేపట్టిన మార్గదర్శకాలలో కేంద్రీయ విద్యాలయాలను తొలగించారా అంటే అవుననే చెప్పాలి. ఈ పథకం గురించి మార్గదర్శకాలు కేంద్రీయ విద్యాలయాల సంస్థకు సమాచారం లేదని అధికారులు ధ్రువీకరిస్తున్నారు. ఈ సంస్థలను విస్మరించారా? లేక మరచిపోయారా అనే విషయం విద్యా శాఖ ఉన్నతాధికారులే స్పష్టం చేయాల్సి ఉంది.

గ్రీవెన్స్‌కు దరఖాస్తు...

రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు తల్లికి వందనం అమలు కాలేదని, తాను ఇతర జిల్లాల ప్రిన్సిపల్స్ మాట్లాడినట్లు స్థానిక ప్రిన్సిపాల్ ఎం. మనీష్ కుమార్ తెలిపారు.. ఈ విషయం గురించి జడ్‌పి సిఇఒ, ఎంఇఒ, సచివాలయ సిబ్బందితో తాను మాట్లాడానన్నారు. గ్రీవెన్స్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థుల పర్మినెంట్ ఎదుకేషన్ నంబర్‌తో స్టడీ సర్టిఫికెట్స్ ఇచ్చినట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం, మార్గదర్శకాలు తమకు అందలేదని ఆయన స్పష్టం చేశారు.

శాంతినగర్‌లో నీటి ఎద్దడి

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు



నీటి కోసం ఎదురు చూస్తున్న మహిళ

మార్కాపురం మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి తాండవిస్తోంది. శివారు ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. మున్సిపల్ అధికారులు నీటి ఎద్దడిపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు నీటి అవసరాలు తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. నీటి అవసరాల కోసం కూలి పనులు మానుకుని వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది.

మార్కాపురం మున్సిపాలిటీ రెండో వార్డులోని శాంతి నగర్‌లో నీటి సమస్య జఠిలంగా మారింది. ఇక్కడ నివాసితులంతా దినసరి కూలీలే. సమీపంలోని పలకల పారిశ్రామికవాడలో కార్మికులుగా ఉపాధి పొందుతున్నారు. శాంతినగర్‌తో పాటు రవీంద్రనగర్, ఏకలవ్య కాలనీలోనూ నీటి సమస్య ఉంది. సాగర్ నీటి సరఫరా వారంలో ఒకరోజు మాత్రమే జరుగుతోంది. మిగిలిన రోజుల్లో బోరు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. ప్రస్తుత తరుణంలో భూగర్భంలో జలమట్టం తగ్గడంతో బోరు బావులు ఎండిపోయాయి. బోర్లలో నీరు లభ్యత కాకపోవంతో అక్కడి ప్రజలు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. వారంలో ఒకసారి వచ్చే సాగర్ నీటితో అవసరాలు తీరడం లేదు. వారంలో నాలుగు రోజులు నీటి కష్టాలు అనుభవించాల్సి వస్తోంది. బోర్ల నీటి సరఫరా లేని కారణంగా కనీసం ట్యాంకర్ల ద్వారా కూడా మున్సిపల్ అధికారులు నీటి సరఫరా చేయడం లేదు. ఒకటి రెండు బోర్ల నుంచి సన్నటి ధారగా వస్తున్న నీటి కోసం కూలి పనులు మానుకొని నీటి సేకరణలో ఉంటున్నారు. బిందె నీరు నిండాలంటే గంట సమయం పడుతోంది. ఈ లెక్కన ఒక్కో కుటుంబంలో 30 నుంచి 40 బిందెల నీటి కోసం రోజంతా పడిగాపులు కాస్తున్నారు. ప్రధానంగా ఎస్టేట్‌లోని శాంతినగర్‌లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. సమస్య ఇదే విధంగా ఉంటే ఆందోళనకు సిద్ధం కాక తప్పదని ఆ వార్డు ప్రజలు హెచ్చరిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించాలని, నీటి సమస్య తీర్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వృద్ధులకు అగచాట్లు..

రేషన్ సరుకులు తీసుకోలేక ఇబ్బందులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఓ నిర్ణయం యర్రగొండపాలెం మండలంలోని వృద్ధులకు, వికలాంగులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. ఇప్పటివరకు మండలంలోని వృద్ధులకు "ఎండియు" వాహనాల ద్వారా ఇంటికే రేషన్ సరుకులు అందుతూ వచ్చాయి. కానీ ఈ నెల మొదటివారంలో ఆ వాహనాలను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రేషన్ కార్డుదారులు నేరుగా రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తీసుకోవాలన్న నిబంధనను అమలుచేసింది. అయితే ప్రభుత్వం ప్రకటించినట్లుగా 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు రేషన్ సరుకులు ఇంటి వద్దకే అందిస్తామన్న హామీ మాటలకే పరిమితమైంది. స్థానిక డీలర్లు, రూట్ ఆఫీసర్లు ఈ ప్రక్రియను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దాంతో అనేకమంది వృద్ధులు రేషన్ షాపులకు వెళ్లలేక నిత్యావసర సరుకులు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, వికలాంగులు ఆశతో ఇప్పటిదాకా వేచిచూశారు. 'డీలర్లు సరుకులు తీసుకుని ఇంటికే వస్తారేమో' అన్న నమ్మకంతో ఉన్నారు. కానీ ఎవరూ రాకపోవడంతో తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. 'వయస్సు మీదపడింది. నడవలేము. మనల్ని ఎవరు పట్టించుకుంటారు?' అంటూ తమ బాధను వెల్లబోసుకుంటున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మళ్లీ ఎండియు వాహనాల వసతి కల్పించాలని, లేదా డీలర్లే ఇండ్లకు వచ్చి సరుకులు అందించేలా కచ్చితమైన ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నారు. లేకపోతే నిత్యావసరాల లభ్యత కష్టతరమవుతుందని, వృద్ధులు వాపోతున్నారు. వృద్ధులకు, వికలాంగులకు రేషన్ సరుకులు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తీరంలో ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

వివిధ రాజకీయ పార్టీల నాయకులు వారికి మద్దతుగా నిలిచారు. ఈ నేపథ్యంలో కాలువలోని బోట్లు సముద్రంలోకి వెళ్లేందుకు వీలుగా బాపట్ల డిఎస్‌పి రామాంజనేయులు జెసిబితో అక్కడ ఉన్న కొండరాళ్లను తొలగించే ప్రయత్నం చేశారు. ప్రజా సంఘాలు, మత్స్యకారులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు మత్స్యకారులకు మధ్య వాగ్వివాదం నెలకొంది.

సిమౌత్‌ను పూడ్చివేసిన వెంకట్రావు,అతనికి సహకరించిన అధికారులపై కేసులు నమోదు చేయాలని మత్స్యకారులు రిమాండ్ చేశారు. ఫిర్యాదు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి తెలిపారు. కలెక్టర్ స్వయంగా సిమౌత్ పరిశీలించి రియల్ ఎస్టేట్, రిసార్ట్స్ యాజమాన్యానికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరారు. ఈ విషయం గురించి పోలీసు, రెవెన్యూ అధికారుల ద్వారా సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ వివాదాస్పద భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని, భూమిపై బిఎన్‌ఎస్ 163 యాక్ట్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

మత్స్యకారుల ఆందోళనకు సిపిఎం నాయకులు ఎన్.బాబూరావు పి.కొండయ్య, ఎం.వసంతరావు, బిఎస్‌పి ప్రతినిధులు డి.జగన్మోహనరావు, ధరణికోట లక్ష్మీనారాయణ, కాటి మార్కు, మత్స్యకారుల ఐక్యవేదిక ప్రతినిధులు జి.నాగార్జున, కె రవీంద్ర, పొన్నపూడి జాలయ్య, సూరిబాబు, వూసపల్లి, చేపల గాలియ్య , ఏరిపిల్లి రమణ,చొక్కా రాంబాబు మద్దతు తెలిపారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించలేదు

చీరాల-బాపట్ల సరిహద్దులోని ఈపురుపాలెం స్టయిట్ కట్‌కు తూర్పు వైపున 10.36 ఎకరాలు భూమిని 2008 మార్చి 26న కొనుగోలు చేశాని,ప్రభుత్వ భూమిని తాను ఆక్రమించలేదని బుర్ల వెంకట్రావ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ భూమికి సంబంధించి పాస్ పుస్తకం డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నట్లు తెలిపారు. తాను ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు నిరూపిస్తే ఎలాంటి చర్యలకైనా తాను సిద్ధమని పేర్కొన్నారు.

శిథిల భవనంలో బిక్కుబిక్కుమంటూ..

భయం నీడలో చిన్నారుల చదువులు

కూలిపోయే స్థితిలో అంగన్‌వాడీ కేంద్రం

పెచ్చులూడి పడుతున్న శ్లాబు

మధ్యలోనే నిలిచిన భవన నిర్మాణం

పట్టించుకోని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

అంగన్వాడీ కేంద్రం కోసం నిర్మిస్తున్న భవనం అధికారుల నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో శిథిల భవనంలో భయం నీడలో చిన్నారులు చదువుకోవాల్సిన పరిస్థితి మండలంలోని దర్శి తిమ్మక్కపల్లి (డిటీ పల్లి) గ్రామంలో నెలకొంది. ఈ గ్రామంలో ప్రైవేటు భవనంలో అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థలో ఉండటంతో అక్కడ ఎవరూ నివాసం ఉండటం లేదు. గ్రామంలో మరో భవనం ఏదీ లేకపోవడంతో ఈ శిథిల భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత టిడిపి ప్రభుత్వంలో సొంత భవనం నిర్మించేందుకు పనులు మొదలుపెట్టారు. అయితే బిల్లులు రాలేదనే కారణంతో కాంట్రాక్టర్ నిర్మాణాన్ని అసంపూర్తిగా నిలిపివేశారు. గత వైసిపి పాలనలో ఐదు సంవత్సరాల కాలంలో ఈ భవనం గురించి పట్టించుకో లేదు.

ఇది ఇలా ఉండగా అంగన్వాడి కేంద్రం నిర్వహిస్తున్న శిథిల భవనం కూడా పూర్తి స్థాయిలో శిదిలమైపోయింది. స్లాబ్ మొత్తం ఫెచ్చులూడి చువ్వలు తేలి ఉన్నాయి. పెచ్చులూడి కింద పడుతున్నాయి. వర్షం కురిసే సమయంలో భవనం మొత్తం కారుతూ భవనం గోడలు షాక్ కొడుతుండడంతో ఈ భవనానికి విద్యుత్ సరఫరాను నిలిపి వేసినట్లు అంగన్వాడి కార్యకర్త శైలజ తెలిపారు. శిథిల భవనం ముందు వేసిన రేకుల కింద కేంద్రం నిర్వహిస్తూ ఇబ్బంది పడుతున్నట్లు ఆమె తెలిపారు. సమస్య పరిష్కారం కోసం గత ఆగస్టు 23న సీఎస్‌పురంలో జరిగిన ఉపాధి హామీ గ్రామ సభలో కలెక్టర్, జిల్లా అధికారులకు అర్జీ అందజేసినట్లు ఆమె చెప్పారు. అలాగే ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరికీ విన్నవించినా ఎవరు పట్టించుకోవడంలేదని ఆమె వాపోయారు. వంట చేసే సమయంలో వంట గదిలో పెచ్చులూడి పైన పడుతున్నాయని దీంతో వంట చేసేందుకు గదిలోకి వెళ్లాలంటే భయంగా ఉందంటూ అంగన్వాడీ హెల్పర్ సుగుణమ్మ వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సొంత భవనాన్ని పూర్తి చేయించి ఇబ్బందులు తీర్చాలని అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఈ విషయంపై ఐసిడిఎస్ వెలిగండ్ల సిడిపిఓ కృపావరంను ప్రజాశక్తి వివరణ కోరగా ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు రాలేదని, తనకు రావాల్సిన బిల్లులు చెల్లించే వరకు పనులు చేయనని కాంట్రాక్టర్ రమణయ్య చెబుతున్నట్లు తెలిపారు. ఎంపీపీతో మాట్లాడి భవనం పనులు పూర్తిచేసే ఏర్పాటు చేస్తానన్నారు.



అసంపూర్తిగా నిలిచిన భవనం



పెచ్చులూడిన శ్లాబు



ఎస్‌ఎఫ్‌ఐ జెండాని ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి, సిహెచ్ వినోద్

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చీమకుర్తి

జూన్ 27 నుంచి ఐదు రోజులపాటు జరిగే ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి సిహెచ్ వినోద్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మూడేళ్లకు ఒకసారి జరిగే జాతీయ మహాసభలలో విద్యా రంగంలో జరుగుతున్న పరిస్థితులను చర్చించడం జరుగుతుందన్నారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాకు సంబంధించిన విద్య నేడు కేంద్రం చేతుల్లోకి తీసుకుందని పేర్కొన్నారు. విద్యా సామాన్యుడికి అందరి దక్షలా మార్చేసిందని పేర్కొన్నారు. విద్య కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ లక్ష్యంగా, నూతన విద్యా విధానం తీసుకొచ్చారని విమర్శించారు. ఈ నేపథ్యంలో జరిగే జాతీయ మహాసభలు దేశ విద్యారంగ భవిష్యత్తు, దిశ నిర్దేశాన్ని నిర్ణయిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.విజయ్, జిల్లా సహాయ కార్యదర్శి జి.దేవరాజు, జిల్లా కమిటీ సభ్యులు పాండురంగారావు, గంగాంజి, విజయానంద్, చీమకుర్తి మండల నాయకులు నాగుల్ మేరా, వాసు బాబు, శ్రీకాంత్, మణికంఠ, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-దొనకొండ

మండలంలోని అన్ని గ్రామాల్లో మంచి నీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో కొంతమేర అయినా మంచినీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. ఎంపీటీసీలు మాట్లాడుతూ ఎండాకాలం వచ్చిందంటే చాలా చోట్ల పైపులు లీక్ కావటం, మూగ జీవాల కోసం పశువుల కాపరులు పగలకొట్టడం వంటి సమస్యలు వస్తున్నాయన్నారు. ఉప ఎంపీపీ వడ్లమూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మల్లంపేట ఎస్సీకాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని అధికారులకు తెలిపారు. సంగాపురం సర్పంచ్ భీమిని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మా గ్రామంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి చాలా రోజులైనా కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించలేదన్నారు. అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల వినతులను త్వరగా పరిష్కరించేందుకు ఎంపీపీతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశానికి పలువురు అధికారులు బదిలీపై వెళ్ళటంతో సభా ప్రాంగణం వెలవెలపోయింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మురికిపూడి సుధాకర్, దొనకొండ పీఎస్ డా.చంద్రమౌళి, డిప్యూటి ఎంపీడీవో పి.శ్రీనివాసులు, విద్యాధికారి ఎన్.సాంబశివరావు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఉషామురళి

పగటిపూట తాగునీరు సరఫరా చేయాలి

సిపిఎం నగర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ : ఒంగోలు నగర ప్రజలకు పగటి వేళల్లో తాగునీటి సరఫరా చేపట్టాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. కమిటీ తరపున పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు శుక్రవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి నగరపాలక సంస్థ చేతులెత్తేసిందని ఆయన ఆరోపించారు. తాగునీటి సరఫరా ప్రక్రియలో ఒక క్రమ పద్ధతి పాటించని కారణంగా నగర వాసులందరూ ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. రోజువారి పనులు చేసుకొని కుటుంబాలను పోషించుకునే పేదలు నిద్రపోవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందన్నారు. మంచినీటి సరఫరాలో అవినీతిని అరికట్టడంలో నగరపాలకు సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కాలనీల్లో వారానికి రెండు డ్రమ్ములు మాత్రమే ఇస్తున్నా రని విమర్శించారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో మూడు రోజులకు ఒకసారి మంచిని సరఫరా చేస్తామని నగరపాలక సంస్థ ఇచ్చిన హామీ అమలు కాలేద న్నారు. పాలకవర్గం కనీసం మూడు రోజులకు ఒకసారి నగరంలో ప్రజలకు ట్యాంకర్ల ద్వారా మంచినీరు ఇవ్వాలని, సమస్యలను పరిష్కరించకుంటే నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు వీడ్కోలు సభ

ప్రజాశక్తి-సిఎస్.పురం: వ్యవసాయ విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలని కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్ అన్నారు. గురువారం రాత్రి కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గౌరవ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్ బోధన సిబ్బందితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల: ప్రకాశం జిల్లాలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్లకు 25న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వెలుగొండ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల దర్శిలో బాలురకు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల(బాలికలు) మార్కాపురంలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి రోస్టర్ పద్ధతిలో అడ్మిషన్లు ఇస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులను 23వ తేదీలోపు సంబంధిత పాఠశాలలో సమర్పించాలన్నారు.

అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ: అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వంశీధర్, డాక్టర్ లీనా రేఫెల్ అన్నారు. శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీ మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలు రోజుకు మూడుసార్లు కంటే ఎక్కువగా పలుచగా విరేచనాల అయితే అతిసారగా భావించవచ్చన్నారు. అలాంటి వారికి 14 రోజులు పాటు మందులు ఇవ్వాలన్నారు. అతిసార వ్యాధి రాకుండా భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను శుభ్రంగా కడగాలని సూచించారు. మరియు విటమిన్ ఏ సిరప్, స్వచ్ఛమైన నీటిని తాగించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పీరయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, విజయమ్మ, సునీత పాల్గొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బాలిక ఆత్మహత్యపై కేసు నమోదు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. యర్రగొండపాలెం మండలంలోని పాత గోళ్లవిడిపి గ్రామానికి చెందిన బరిగెల శైలమ్మ(16) అనే ఇంటర్ విద్యార్థిని ఇంట్లో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గత కొన్ని రోజులుగా మానసిక ఒత్తిడికి గురైనట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే ఆమె ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ ఘటనపై ఆమె సోదరుడు బరిగెల ఎలీషాబాబు యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో శైలమ్మ ఆత్మహత్యకు ఎందుకు పాల్పడినదనే అంశంపై తన అనుమానాలను వెల్లడిస్తూ పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ మేరకు ఎస్ఐ పి.చౌడయ్య శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన పట్ల గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయస్సులోనే ఓ బాలిక ఇలా బలవన్మరణానికి పాల్పడటం కలచివేసే విషయం అని పలువురు అంటున్నారు. కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సిఐ సిహెచ్ ప్రభాకరరావు బాలిక మృతదేహాన్ని సందర్శించి కేసు పూర్వాపరాలను తెలుసుకున్నారు.

పొలం వివాదంలో ఘర్షణ

ఒకరి గాయాలు.. కేసు నమోదు

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామంలో ఇద్దరి మధ్య పొలం విషయంలో గొడవ జరిగిన ఘర్షణకు దారి తీసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరావు తెలిపారు. వివరాల ప్రకారం.. దారం సురేందర్‌రెడ్డి మరియు దారం అంజమ్మ మధ్య పొలాల భాగాల విషయంలో గురువారం గొడవ జరిగింది. ఈ గొడవలో భారం సురేందర్‌రెడ్డి ఇనుప రాడ్డుతో దారం వెంకటరమణారెడ్డి తల నుదుట భాగమును కొట్టగా తలకు రక్తగాయమైంది. దీనితో వెంకటరమణారెడ్డిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ప్రజాశక్తి-దొనకొండ

సాంకేతికత సాయంతో పోయిన సెల్‌ఫోన్‌ను దొనకొండ పోలీసులు గుర్తించి శుక్రవారం బాధితుడికి అందజేశారు. ఎస్ఐ టి.త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆరవల్లిపాడు గ్రామ నివాసి జి.బాలకాశయ్యకు చెందిన సెల్ ఫోన్ పోవటంతో అతను స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. సాంకేతిక సాయంతో సెల్‌ఫోన్ ఉన్న ప్రాంతాన్ని కనుగొని బాధితునికి అప్పగించటం జరిగింది. ఈ సందర్భంగా బాలకాశయ్య ఎస్ఐకి, సిబ్బందికి ధన్యవాధాలు తెలిపారు.



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని త్రిపురాంతకం మండలంలో గల గొల్లపల్లి గ్రామంలో మద్యం నియంత్రణ చట్టం ఉల్లంఘనకు పాల్పడిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం యర్రగొండపాలెం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సిఐ సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. కిచిడీ హోటల్ పరిసర ప్రాంతాల్లో మద్యం నిల్వలు బయటపడ్డట్టు చెప్పారు. ఈ దాడిలో ఓ నరేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రూ.1300లు విలువ గల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

'ముళ్లపూడి'కి ఘన నివాళి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని పోతర్లంక గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు ముళ్లపూడి లక్ష్మీనారాయణ (60) అనారోగ్యం కారణంగా గురువారం మృతి చెందారు. ఆయన మృత దేహాన్ని సిపిఎం వేమూరు కార్యదర్శి బి అగస్టీన్, కొల్లూరు నాయకులు పి నాగమల్లేశ్వరరావు, బొనిగల సుబ్బారావు సందర్శించి లక్ష్మీనారాయణ మృతదేహానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



హరితశ్రీని అభినందిస్తున్న రోటరీ ప్రతినిధులు

లాసెట్ ర్యాంకు సాధించిన విద్యార్థినికి అభినందన

ప్రజాశక్తి - అద్దంకి

శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం గురువారం ప్రకటించిన పీజీ లా సెట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన బైసాని శ్రీనివాసరావు కుమార్తె బైసాని హరితశ్రీ 113 మార్కులతో రాష్ట్ర స్థాయిలోప్రథమ ర్యాంక్ సాధించిన సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు ఆయిల్ మిల్లు రోడ్డులోని హర్షిత నివాసానికి వెళ్లి అభినందించారు. ఆమె వృత్తిలో ఇంకా ఉన్న స్థానానికి ఎదగాలని ఆశించారు. కార్యక్రమంలో అలహరి హరిప్రసాద్, పువ్వాద రామ కోటేశ్వరరావు, అద్దంకి లేవిప్రసాద్, లక్ష్మారెడ్డి, శేషారెడ్డి పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు జవ్వాజి నాగమల్లి, నాగమల్లేశ్వరరావు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి తమ్మన శ్రీనివాసరావు సన్మానించారు.



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఇఒ తిమ్మనాయుడు

ఎస్‌బిఐలో కానుకల డిపాజిట్లు

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో భక్తులు గత కొంతకాలంగా సమర్పించిన కానుకలు రూ.9.80కోట్లు వివిధ బ్యాంకుల్లో ఫిక్స్‌డు డిపాజిట్లకు సంబంధిత కార్య నిర్వాహణాధికారులు చేశారు. సింగరకొండ దేవస్థానం అధికారి మదమంచి తిమ్మనాయుడు ఇటీవల పట్టణంలోని 13 బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ బ్యాంకుల ఫిక్స్‌డు డిపాజిట్లపై ఇచ్చే వడ్డీ రేట్ల గురించి టెండర్లు కోరగా అన్ని బ్యాంకుల మేనేజర్లు సమావేశంలో పాల్గొని ఆయా బ్యాంకులు ఇచ్చే వడ్డీ రేట్లను వివరించారు. అత్యధికంగా ఎస్‌బిఐ 7.75 శాతం వడ్డీ ఇచ్చేందుకు ముందుకు రాగా స్వామి వారి నగదును ఆ బ్యాంకులో డిపాజిట్లు చేస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి తిమ్మనాయుడు తెలిపారు. కార్యక్రమంలో సింగరకొండ దేవస్థానం సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పేస్లిప్పులు ఇవ్వాలి

ప్రజాశక్తి - అద్దంకి

ఉపాధి కార్మికులకు పే స్లిప్పులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రోజు రూ.307 వేతనం ఇవ్వాలని కోరారు. కార్మికులకు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని కోరారు. రోజుకు రూ.600 వేతనం పెంచాలని, ఉపాధి కార్మికులకు వేసవి బత్యం, అన్ని రకాల అలవెన్స్‌లు గతంలో మాదిరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



కూలీలతో మాట్లాడుతున్న తంగిరాల వెంకటేశ్వర్లు

పొగాకు మండెలను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని అన్నంబోట్లవారిపాలెంలో పొగాకు సాగు చేసిన రైతులకు సంబంధించిన మండెలను శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పొగాకు రైతులతో మాట్లాడారు. పొగాకు బెళ్లకు మంచి రేటు పలకాలంటే మార్క్‌ఫెడ్ సూచించిన నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. రైతులు తమ పొగాకును కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లాలని తెలిపారు. పొగాకు ఎంత సాగు చేశారు? ఎంత అమ్మారు? ఎంత నిలువ ఉందనే వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులు తీసుకువచ్చిన పొగాకు తేమ శాతాన్ని పరిశీలించారు. అధికారులు నుండి వివరాలు సేకరించారు. పొగాకు కొనుగోలు ఏ విధంగా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. పొగాకు రైతులందరూ తమ పొగాకును రెండు గ్రేడులుగా విభజించుకొని కేటాయించిన సమయంలో కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ఆందోళన పడాల్సిన అవసరం లేదని చెప్పారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల వద్ద ఉన్న చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ గోదాములు సరిపోని పక్షంలో ప్రైవేటు గోదాములు కూడా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఆయన వెంట ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక దగ్గుబాటి విద్యా సంస్థల ఆవరణలో ఏర్పాటు చేసిన డాక్టర్ డివిఆర్ సైనిక పాఠశాల విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభోత్సవ ఏర్పాట్లను మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావుతో కలిసి కలెక్టర్ జె వెంకట మురళి శుక్రవారం పరిశీలించారు. ఇంకొల్లు గ్రామంలో ఆయన పర్యటించారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యా బోధన నిర్వహించే పాఠశాల భవన సముదాయాన్ని పరిశీలించారు. 8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన పాఠశాల తరగతి గదులు, వసతి గృహం సదుపాయాలు తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణకు ప్రభుత్వ అనుమతులపై వివరాలు తెలుసుకున్నారు. 72 గదులతో నిర్మించిన భవన సముదాయం నాణ్యతా ప్రమాణాలు పరిశీలించారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ కార్యక్రమం ఖరారు కాగానే ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్, డీఈఓ పురుషోత్తం, తహశీల్దారు ఎవిఎస్ శ్రీనివాస్, ఎంపిడిఓ పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, మాజీ మంత్రి దగ్గుబాటి

క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనే ఉపాధ్యాయుడి లక్ష్యం

ప్రజాశక్తి - పంగులూరు

ఉద్యోగ రీత్యా ఎక్కడ, ఏ పాఠశాలలో పనిచేసినా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన చేయటమే ఉపాధ్యాయుల లక్ష్యమని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొప్పోలు రమాదేవి అన్నారు. తమ పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు దాట్ల శాంతి, శ్రీగిరి శ్రీనివాసరావు, ఎస్‌విడివి ప్రసాద్, చేబ్రోలు హరిబాబు, దేవరకొండ ఉమాదేవి, షేక్ షహీన్నా బేగం, జి సాంబశివరావును శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలలో క్రమశిక్షణతో విద్యార్థులను ప్రోత్సహించి మంచి ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లటం బాధాకరమని అన్నారు. ఉద్యోగరీత్యా బదిలీలు తప్పవని అన్నారు. ప్రతి ఉద్యోగి అనేకసార్లు బదిలీలు కావాల్సిందేనని, అయితే ఉపాధ్యాయులు ఎక్కడ పనిచేస్తుంటే అక్కడి విద్యార్థుల భవిష్యత్తు కోసం, వారి ఎదుగుదల కోసం కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు శ్రీగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పంగులూరు హైస్కూల్ నుంచి వెళ్లటం బాధాకరమైనప్పటికీ ఉద్యోగాలుగా తమకు తప్పదని అన్నారు. గత ఎనిమిదేళ్ల కాలంలో ఇక్కడ విద్యార్థులు చూపిన ప్రేమ, అభిమానం, తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు చూపిన అభిమానం, సహకారం మరువలేనివని అన్నారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ శ్రీనివాసరావు, కరిముల్లా, బాచిన నారాయణరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, భాస్కర మూర్తి, బడే సాహెబ్, మేక హరిబాబు, లక్ష్మీ పాల్గొన్నారు.



సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు



శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు కొండయ్య, ఏలూరి

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - చీరాల

తిరుమల, తిరుపతి దేవస్థానంలో కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామిని చీరాల, పర్చూరు శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య, ఏలూరి సాంబశివరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కొండయ్య తన కుటుంబ సభ్యులు, టిడిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్‌తో కలిసి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.



మాట్లాడుతున్న సమాఖ్య అధ్యక్షురాలు కృష్ణవేణి

రుణాలు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక స్త్రీ శక్తి భవనం నందు మండల సమైక్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు కృష్ణవేణి మాట్లాడుతూ గ్రామ అధ్యక్షులు అందరు స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగాహన కల్పించి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం అందించే సేవలను అన్ని గ్రూపుల లీడర్లు, సభ్యులకు తెలియజేసి భాగస్వాములు అయ్యే విధంగా చూడాలని అన్నారు. ఎపిఎం వెంకట్రావు, సీసీలు కోరిశ పాటి రవికుమార్, రవిబాబు, పవన్, రామ్ పాల్గొన్నారు.



సంపద తయారీ కేంద్రంలో పరిశీలిస్తున్నఎంపిడిఒ

సంపద తయారీ కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని వెంకటాపురం పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌ను డిప్యూటీ ఎంపిడిఒ ఆర్‌విఎస్ ప్రసాదరావు శుక్రవారం సందర్శించారు. ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ నందు వర్మీ కంపోస్టు తయారు చేయుట, ప్రతిరోజూ ఇంటింటి నుండి చెత్త సేకరణ చేయాలని పంచాయితీ కార్యదర్శి, క్లాప్ మిత్రలకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బందికి శనివారం జరుగనున్న ప్రపంచ యోగా దే సందర్భంగా సచివాలయం పరిధిలో యోగాకు నమోదైన అందరూ రేపు ఉదయం 6 గంటలకు హాజరయ్యేటట్లు చూడాలని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 25న థీమ్ నీరు, మీరు ప్రోగ్రాం నిర్వహించాలని చెప్పారు.

గుర్తింపు కార్డులు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఇంకొల్లు

కౌలు వ్యవసాయం చేసే రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలని ఎఒ ఎన్ మేరమ్మ అన్నారు. మండలంలోని వంకాయలపాడు, సుబ్బారెడ్డిపాలెం గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు పొలానికి సంబంధించి పత్రాలు చూపించి గుర్తింపు కార్డులు తీసుకోవాలని అన్నారు. గుర్తింపు కార్డులు ఉంటేనే కౌలు రైతులకు ప్రభుత్వ రాయితీలు, దిగుబడి కొనుగోలు తదితర పథకాలు వర్తిస్తాయని అన్నారు. గ్రామాల్లో ఉన్న చవిటి భూములను చౌడు లేకుండా చేసుకోవడానికి సేంద్రీయ ఎరువులతో పాటు జింక్, పాస్ఫేట్, జింక్ సెల్ఫ్ వంటివి ఉపయోగించుకొని నివారించుకోవచ్చని అన్నారు. తద్వారా ఆ భూములు పంటలు పండటానికి అనువుగా మారతాయని అన్నారు. కార్యక్రమాలలో విఎఎలు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - మద్దిపాడు

రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు మొత్తాన్నీ కొనుగోలు చేస్తామని, రైతుల ఎలాంటి ఆందోళనా చెందొద్దని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు మండల పరిధిలోని గార్లపాడు గ్రామంలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బిఎన్.విజయ్ కుమార్ తో కలిసి కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి, మద్దిపాడు, పామూరు, దొనకొండ, కొత్తపట్నం, ముండ్లమూరు, పొదిలి, తాళ్లూరు, నాగులుప్పలపాడు, ఒంగోలు మండలాలలో 1,088 మంది రైతులు 4,841 ఎకరాల విస్తీర్ణంలో నల్లబర్లీ పొగాకును సాగు చేసినట్లు చెప్పారు. తద్వారా 50,380 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు పేర్కొన్నారు. రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు మొత్తాన్నీ మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ చరిత్రలో తొలిసారి నల్లబర్లీ పొగాకును మార్క్ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌డిఎం రకం పొగాకును కిలో రూ.120, హెచ్‌డిఎక్స్ రకం పొగాకును కిలో రూ.60 చొప్పున కొనుగోలు చేస్తారనితెలిపారు. తేమ శాతం 20 లోపు ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు విక్రయించాలనుకునే రైతులు ముందుగా సిఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తద్వారా రైతులు ఏ రోజు ఏ ప్లాట్ ఫారం వద్దకు పొగాకును తీసుకురావాలో వారి మొబైల్‌కు ముందుగానే సందేశం వస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా మార్క్ ఫెడ్ సంస్థ మేనేజర్ హరికష్ణ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్ బాబు, ప్రాజెక్టు మేనేజర్ కళ్యాణ్‌రామ్, ప్రాజెక్ట్ డిప్యూటీ మేనేజర్ సుబ్రహ్మణ్యం, తహశీల్దారు ఆదిలక్ష్మి, ఎంపిడిఒ శ్రీనివాస్ వరప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి స్వర్ణలత, టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, పార్లమెంట్ రైతు అధ్యక్షుడు నెప్పాలి సుబ్బారావు, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు,సెక్రటరీ లక్ష్మి నరసయ్య, రావి మహేష్, మందపల్లి శ్రీనివాసరావు, కావూరి విజయరాజు, అబ్బూరి శేషగిరి, పెనబాకు సునీల్, చిన్నకేశవులు,కనగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పొగాకును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్

కంచర్ల రామయ్య మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం ఇం/తీనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు కంచర్ల రామయ్య మతి తీరని లోటని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న హైదరాబాద్ లోని కిమ్స్ ఆస్పత్రి లో చికిత్స పొందుతూ కంచర్ల రామయ్య మతి చెందడం బాధాకరమన్నారు. కందుకూరు లాంటి గ్రామీణ ప్రాంతంలో ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలను స్థాపించి వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధాన భూమిక వహించిన ఆంధ్ర పత్రికను మాగుంట శ్రీనివాసులు రెడ్డి తోడ్పాటు తో పున్న ప్రారంభించడంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. కుమారుడు కంచర్ల శ్రీకాంత్‌ను రాజకీయాలలో ప్రోత్సహించి శాసనమండలి సభ్యుడిగా ఎన్నిక కావడంలో ప్రత్యేక కషి చేశారన్నారు.



ఇవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట భద్రత

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాకు సంబంధించిన ఇవిఎంలను భద్రపరచిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఇవిఎం) గోదాములను శుక్రవారం స్టేట్ ఎలక్షన్ డిప్యూటీ సిఈఒ విశ్వేశ్వరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌లో భద్రపరచిన ఇవిఎం యంత్రాలు బియులు, సియులు, వివిప్యాట్‌లను అక్కడి భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ క్షుణంగా పరిశీలించారు. అప్రమత్తుంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్‌డిఒ కె.లక్ష్మి ప్రసన్న, కలెక్టరేట్ సూపరింటిండెంట్ శ్రీనివాసరావు, వైసిపి ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, టిడిపి ప్రతినిధి కోనేటి వెంకటరావు , బిజెపి ప్రతినిధులు గుర్రం సత్యం, మాకినేని అమర్ సింహ , కాంగ్రెస్ ప్రతినిధి ఎస్‌కె.రసూల్, రాజశేఖర్ రెడ్డి, ఉపేంద్ర, నవీన్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు కామ్రేడ్ లక్ష్మిదాసు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

వర్క్‌చార్జ్డ్ ఉద్యోగులకు కామ్రేడ్ లక్ష్మి దాసు ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బి సర్కిల్ కార్యాలయం వద్ద ఉన్న విశ్రాంత వర్క్ చార్జ్డ్ ఉద్యోగుల భవనంలో లక్ష్మి దాసు 41వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ఒంగోలు టౌన్ బ్రాంచి అధ్యక్షుడు కె.రామమోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. 1970 దశకంలో ఉద్యోగుల సమస్యలపై అవిశ్రాంత పోరాటం నడిపిన కామ్రేడ్ లక్ష్మి దాసు ఈ తరం ఉద్యోగులకు ఆదర్శమన్నారు. ప్రకాశం జిల్లాశాఖ అధ్యక్షుడు బి. అంకిరెడ్డి, ట్రెజరర్ రామ కోటేశ్వర రావు, ప్రసాద్, ఇరిగేషన్ శాఖ ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బివి.సుబ్బారెడ్డి, టౌన్ యూనిట్ గౌరవాధ్యక్షుడు వీర రాఘవ స్వామి మాట్లాడుతూ వర్క్‌చార్జ్డ్ విధానం అమలు అవుతున్న కాలంలో, అతి తక్కువ వేతనాలు అమలు అవుతున్న దశలో పిఎస్ ఛార్జీలు పెంపు కోసం, వేతనాలు పెంపుదల కోసం లక్ష్మిదాసు అవిశ్రాంత పోరాటం చేసినట్లు గుర్తు చేసారు. అప్పట్లో ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల్లో వర్క్ చార్జ్డ్ ఉద్యోగులను ఉద్యోగులుగా గుర్తించలేదని తెలిపారు. లక్ష్మి దాసు పోరాటం వల్ల వర్క్ ఛార్జ్డ్ సిబ్బందిని ఉద్యోగులుగా గుర్తించినట్లు వివరించారు. ఆయన చేసిన పోరాట ఫలితాంగానే రిటైర్డ్ అనంతరం చిరుద్యోగులకు కనీస సౌకర్యాలు పొందగలిగినట్లు పేర్కొన్నారు. లక్ష్మిదాస్ ఇచ్చిన స్ఫూర్తి తో ప్రతి ఉద్యోగి, పెన్షనర్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఉద్యమించడమే లక్ష్మి దాసుకు అందించే నివాళి అని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని ప్రతిన బూనారు. తొలుత లక్ష్మిదాస్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ జె. పాపారావు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాకులు



ఏరాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

నేడు సూర్యలంక బీచ్‌లో యోగా

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా బాపట్ల మండలం సూర్యలంక బీచ్ తీరంలో చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం పరిశీలించారు. శనివారం ఉదయం 5 గంటల నుంచి 10వేల మందితో సూర్యలంక బీచ్ లో యోగాసానాలు చేయడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రజలందరూ హాజరుకావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా పాల్గొన్నారు.



మాగుంటకు పుస్తకం అందజేస్తున్న మంత్రి లోకేష్

ఎంపీ మాగుంటకు యువగళం పుస్తకం అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్ : రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని ఒంగోలు మాగుంట శ్రీనివాసులు రెడ్డికి అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా యువతను భాగస్వామ్యం చేస్తూ 226 రోజుల పాటు 3,312 కిలోమీటర్ల మేర చేపట్టిన పాదయాత్రలో ఎదురైన అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని లోకేష్ ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌కు ఎంపీ మాగుంట అభినందనలు తెలియజేశారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ : జిల్లా లోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో 2025-2026 వ సంవత్సరానికి 2 వ విడత ప్రవేశాల కోసం ఆన్‌లైన్ (వెబ్‌సైట్) ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, ప్రకాశం జిల్లా కన్వీనర్ సిహెచ్‌ఎస్‌వి. ప్రసాద్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఐటిఐ.ఐఎన్‌సి.ఐఎన్ అనే వెబ్ సైట్ ద్వారా తమ దరఖాస్తులను జులై 15 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రింట్ కాపీని డౌన్‌లోడ్ చేసు కోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు జులై 17న గుంటూరు రోడ్డులోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ వద్దకు హాజరు కావాలన్నారు. జులై 21 కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ప్రభుత్వ ఐటిఐల్లో 21,22 తేదీలు, ప్రైవేట్ ఐటిఐల్లో 23 నుంచి 25 వరకూ అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు హాజరయ్యి అడ్మిషన్ పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9492277552 సెల్ నెంబర్ లేదా ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ఒంగోలు ఆఫీసులో పని వేళల యందు సంప్రదించాలన్నారు.

ఆర్‌టిసి కండక్టర్లకు యోగాపై శిక్షణ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : ప్రపంచ యోగా దినోత్సవంపై ఆర్‌టిసిలో పనిచేస్తున్న కండక్టర్లకు శుక్రవారం డిపిటిఒ కార్యాలయంలో యోగాపై అవగా హన కల్పించారు. యోగా మాస్టర్ ఆంజనేయులు యోగాలో పాటించాల్సిన మెలుకువలు, ప్రయోజనాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం సత్యనారాయణ మాట్లాడుతూ ఆదాయ పెంపుదలకు పాటించాల్సిన విధానాలు, ఆరోగ్య రక్షణ, ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వక ప్రవర్తన గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ శ్రీనివాసరావు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయం 6 గంటలకే హాజరు కావాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ఉపాధ్యాయులు శనివారం ఆరు గంటలకల్లా పాఠశాలలకు హాజరు కావాలని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వర రెడ్డి ఆదేశించారు. పాఠశాలల్లో చదివే విద్యార్థులను 6 గంటలకల్లా హాజరు పరచాలని ఆదేశించారు. ఉదయం 7 గంటల వరకు మాత్రమే అటెండెన్స్ అనుమతి ఉంటుందన్నారు. 6 నుంచి 8 గంటల వరకు యోగా నిర్వహించి ఫొటోలు లీప్ యాప్‌లో అప్ లోడ్ చేయాలన్నారు. 8 గంటల అనంతరం అల్పాహారం అందిస్తారని తెలిపారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



యోగాపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని ఉప్పుటూరు, బోడవాడ కోల్డ్ స్టోరేజ్ పక్కన నిర్మాణంలో ఉన్న హైవేపై ఉప్పుటూరు హెూమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ పర్యవేక్షణలో గ్రామపెద్దల సహకారాలతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు విజయవంతంగా నిర్వహించారు. అంగన్‌వాడి కార్యకర్తలు, రెవిన్యూ, వెలుగు, ఉప్పుటూరు పంచాయతీ సిబ్బంది, జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఉప్పుటూరి గ్రామ ప్రజలు పాల్గొని యోగ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ2 పి వెంకట్రామయ్య మాట్లాడుతూ డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మండలంలోని విద్యార్థినీ, విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ప్రశంసా పత్రం, యోగా గురువని అవార్డు అందజేశారు.

రేపల్లె : క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవన శైలిని పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ కె సాంబశివరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో యోగా మాస్టర్లను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయో, లింగ భేదం లేకుండా అందరూ యోగా సాధన చేయాలని అన్నారు. ఆధునిక జీవన శైలితో ప్రస్తుతం ప్రజలు అనేక మానసిక, శారీరక రుగ్మతలకు గురవుతున్నారని అన్నారు. యోగ, ధ్యానం సాధన చేయడం ద్వారా వీటిని దూరం చేయొచ్చని అన్నారు. కార్యక్రమంలో టివి పాండురంగారావు, గాలి సురేష్ బాబు, మాజేటి వరప్రసాద్, టి వినోద్ బాబు, కె జగన్మోహనరావు పాల్గొన్నారు.



యోగా శిక్షకులను సన్మానిస్తున్న కమిషనర్ సాంబశివరావు



కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్న ఎఎల్ఒ సాయి జ్యోతి

బాలకార్మిక చట్టం అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - చీరాల

బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టారీత్యా నేరమని, బాల కార్మిక చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎఎల్ఒ సాయి జ్యోతి అన్నారు. బాల కార్మికులను గుర్తించేందుకు పట్టణంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వివిధ మిఠాయి దుకాణాలు, నిత్యవసర సరుకుల దుకాణాలు, గాంధీ క్లాత్ మార్కెట్ ప్రాంతంలోని దుకాణాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె దుకాణ యజమానులకు అవగాహన కల్పించారు. బాలలను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. బాల కార్మిక చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని తెలిపారు. షాడోస్ సంస్థ ప్రతినిధి రాజా సాల్మన్ మాట్లాడుతూ పిల్లలందరూ బడికి వెళ్లాలని, పనికి వెళ్లకూడదని అన్నారు. ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తున్నారని తెలిస్తే సంబంధిత సిబ్బందికి, పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మాధవి, నాగరాజు, బిబిఏ కిషోర్ పాల్గొన్నారు.



రెవెన్యూ సిబ్బందిని సన్మానిస్తున్న తహశీల్దారు శ్రీనివాసరావు

అంకితభావంతో పనిచేసే సిబ్బందికి గుర్తింపు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ అంకితభావంతో పనిచేసే వారికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని తహశీల్దారు మేకా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు డిప్యూటీ తహశీల్దారు అనగాని శాంతలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ 1786లో బోర్డ్ ఆఫ్ రెవెన్యూ ఏర్పాటైందని అన్నారు. 1984 రెడ్డి, కరణం వ్యవస్థ రద్దుచేసి ప్రభుత్వం వంశపారం పర్యంగా వస్తున్న వ్యవస్థ తొలగించినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా వెల్లటూరు విఆర్ఓ శివరామకృష్ణ, విలేజ్ సర్వేయర్ స్వప్న, కార్యాలయ సిబ్బంది శ్రీనివాసరావు, విఆర్ఎ వెంకటేశ్వరరావును ఉత్తమ సిబ్బందిగా గుర్తించి ప్రశంసా పత్రం అందజేసి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫణి కుమార్, విఆర్ఓలు, విఆర్ఎలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులందరూ లైసెన్స్ కలిగిన దుకాణదారుల వద్ద మాత్రమే వరి విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారి ఎండి ఫరూక్ తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు గోతాలపై గుర్తింపు కలిగిన ట్యాగ్ ఉన్న వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సరైన రసీదు, దుకాణదారుని సంతకంతో కూడిన బిల్లులను పొందాలని సూచించారు. విత్తనాల మొలక శాతం, నేల స్వభావత, తదితర వివరాలన్నీ పరిశీలించుకుని కొనుగోలు చేసిన తర్వాత మొలక శాతం పరిశీలించిన తరువాత మాత్రమే నారు నాటాలని తెలిపారు. సబ్సిడీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వరి విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవ కేంద్రాల్లో తమ వివరాలను నమోదు చేయించుకోవాలని తెలిపారు. బిపిటి 5204, ఎంటియు 1224, ఎంటియు 1061, కెఎన్ఎం 1638, ఎన్ఎల్ఆర్ 34449 రకం విత్తనాలు కేజీకి రూ.5 సబ్సిడీపై ఇచ్చేందుకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రెవెన్యూ సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి - యద్దనపూడి



కొల్లూరులో రెవెన్యూ సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

స్థానిక తహశీల్దారు కార్యాలయం నందు శుక్రవారం రెవిన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం జూన్ 20న రెవెన్యూ దినోత్సవంగా నిర్వహిస్తుందని తెలిపారు. ప్రజలందరికీ 100 రకాల సేవలు రెవిన్యూ శాఖ అందిస్తున్నట్లు తెలిపారు. వాటిలో మీసేవ ద్వారా 72సేవలు, తహశీల్దారు కార్యాలయం నుండి 28సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో మనిషి పుట్టిన తేదీ నుండి చనిపో చనిపోయే వరకు అందరికీ అన్ని రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ శాఖ ముఖ్యపాత్ర వహిస్తుందని అన్నారు. గత 240ఏళ్లుగా రెవిన్యూ శాఖ సేవలు అందిస్తుందని అన్నారు. 1786లో రెవెన్యూ బోర్డు ఏర్పాటైందని, అప్పటి నుండి రెవెన్యూ శాఖ ప్రజలందరికీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప తహశీల్దారు విష్ణు, ఇంచార్జ్ ఆర్ఐ ఆశాజ్యోతి, విఆర్ఓలు సత్యనారాయణ, శేషుబాబు, వసంతరావు, రవికుమార్, మేరీ పావని, కోటేసు, సచివాలయ సర్వేయర్లు శ్యామ్, లిల్లీ గ్రేస్ పాల్గొన్నారు.

అద్దంకి : మనిషి పుట్టుక నుండి మృతి వరకు రెవిన్యూ శాఖతో జీవితం ముడిపడి ఉందని తహశీల్దారు జి శ్రీచరణ్ అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రెవిన్యూ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని రకాల రెవెన్యూ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో రెవిన్యూ శాఖదే ప్రధానమైన కృషి అన్నారు. 1786లో రెవెన్యూ బోర్డు ఏర్పాటైనట్లు తెలిపారు.

చెరుకుపల్లి : రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహశీల్దారు సిహెచ్ పద్మావతి అన్నారు. రెవిన్యూ దినోత్సవం సందర్భంగా సిబ్బందికి పౌరసేవలపై అవగాహన శుక్రవారం అవగాహన కల్పించారు. రెవిన్యూ రికార్డులు నిబంధనలకు అనుగుణంగా ఉండాలని చెప్పారు. నూరుశాతం శిస్తు వసూలు చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో విశ్రాంత విఆర్ఓలు రావూరి ఆంజనేయులు, రత్నాకరరావు, విఆర్ఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : రెవిన్యూ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహశీల్దారు బ్రహ్మయ్య కోరారు. రెవిన్యూ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జూన్ 20న రెవెన్యూ దినోత్సవం నిర్వహిస్తుందని తెలిపారు. 100 రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మనిషి పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు అందరికీ అన్ని రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. తహశీల్దారు కార్యాలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బొమ్మల సెంటర్లో ప్రతిజ్ఞ చేయించారు. రెవిన్యూ సిబ్బంది కోలాటం ఆహుతులను అలరించింది. భూమి హక్కు పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రేమ్ కుమార్, విఆర్ఓ వై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొల్లూరు : స్థానిక తహశీల్దారు బి వెంకటేశ్వర్లు అధ్యక్షతన రెవెన్యూ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రెవెన్యూ సేవల మాజీ సెక్రెటరీ తోట సుధాకర ప్రసాద్‌కు నివాళులు అర్పించారు. మండలంలో రెవెన్యూ శాఖలో ప్రతిభ కనపరిచిన సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దారు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : రెవెన్యూ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని తహశీల్దారు పి సింగారావు అన్నారు. రెవెన్యూ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ సిబ్బందితో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది విధులను అంతఃకరణ శుద్ధితో నిర్వహించాలని చెప్పారు. నిబద్ధత, అంకితభావంతో పనిచేయాలని అన్నారు. రెవెన్యూ శాఖపై ప్రజలకు గౌరవం పెరిగే విధంగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు అర్జున్, ఆర్ఐ శ్వేత, సీనియర్ అసిస్టెంట్



మాట్లాడుతున్న ఎఐటియుసి నాయకులు

8 గంటల పని విధానాన్నే కొనసాగించాలి

ప్రజాశక్తి - రేపల్లె

మేడే పోరాట స్ఫూర్తితో కార్మికులు సాధించుకున్న 8గంటల పని విధానాన్ని కొనసాగించాలని, రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేసిన 10 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి ఏరియా గౌరవ అధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి 8గంటల పని విధానం కొనసాగుతుందని అన్నారు. 11ఏళ్ల క్రితం బిజెపి నాయకత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం కార్పొరేటర్ల ఊడిగం చేయడం కోసం కార్మికులపై కక్షగట్టి కార్మిక చట్టాలు రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని అన్నారు. మోడీ ప్రభుత్వం చెప్పిందే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. రాత్రివేళల్లో మహిళలచే పనులు చేయించాలన్న ఆలోచన దుర్మార్గమని అన్నారు. తక్షణమే క్యాబినెట్ తీర్మానాన్ని ఉపసంహ రించుకోవాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, స్కీం వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సిరంశెట్టి శ్రీనివాసరావు, వేణు, శివరామకృష్ణ, సాంబశివరావు, బి దుర్గారావు, యల్లారావు, వీరాస్వామి, అనురాధ, దుర్గాభవాని, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



విశ్రాంత విఆర్ఓను సన్మానిస్తున్న తహశీల్దారు పద్మావతి

గిన్నిస్ వరల్డ్ రికార్డు దిశగా యోగా దినోత్సవం

ప్రజాశక్తి - వేమూరు



మాట్లాడుతున్న ఎంఎల్ఎ నక్కా ఆనందబాబు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విశాఖపట్టణంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ హాజరవుతున్నారని శాసన సభ్యులు నక్క ఆనంద బాబు పేర్కొన్నారు. నెల్లిమర్లలో జనసేన క్రియాశీలక నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 155 బస్సులు కేటాయించినట్లు శాసన సభ్యురాలు లోకం మాధవికి వివరించారు. ప్రతి బస్సుకు 60 మందిని తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ హాజరవుతున్న యోగాంధ్ర గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటుచేసుకోబో తుందని చెప్పారు. కావలి తెలుగుదేశం ఇంచార్జ్ సుబ్బరాయుడు, నెల్లిమర్ల జనసేన నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత విఆర్ఓలకు సన్మానం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రెవెన్యూ శాఖలో సుదీర్ఘకాలం సేవలు అందించి, ప్రజలకు సహాయ సహకారాలు అందజేస్తున్న విశ్రాంత విఆర్ఓలు రావూరి ఆంజనేయులు, ఆవల రత్నాకరరావు అభినందనీయులని తహశీల్దారు సిహెచ్ పద్మావతి అన్నారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సన్మానించారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా ప్రజలకు వివిధ రకాల రెవెన్యూ సేవలు అందజేస్తున్న వారిని రెవెన్యూ సిబ్బంది, ప్రతి ఒక్కరు

ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయండి

- రైతులు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి
- ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి
- రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

నియోజకవర్గంలో ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ ప్రాంతంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ఆయిల్ ఫామ్ కంపెనీ అజంతా సోయ లిమిటెడ్ ప్రతినిధులు ఆయనతో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారని అన్నారు. వేలాది ఎకరాల్లో సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ ప్రాంతంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు



ఎమ్మెల్యే ఏలూరితో అజంతా కంపెనీ ప్రతినిధులు

చేయాలని సూచించారు. ఆయిల్ ఫాంకు మంచి భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు. ఆయిల్ ఫాం సంబంధిత ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉందన్నారు. లాభదాయక పంటల వైపు రైతులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగు వైపు మొగ్గు చూపుతారని అన్నారు. దీనికి అవసరమైన విత్తనాలు, సాంకేతిక సహాయం, మార్కెటింగ్ సదుపాయాలు వంటి అన్ని విషయంలో ప్రభుత్వం పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఫ్యాక్టరీ ఏర్పడితే స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని అన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. మండల ఉద్యాన రైతులు వినూత్న సాగుకు మరలేలా ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం నుంచి పామాయిల్ సాగు చేపట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ఒక హెక్టారుకు రూ.20వేల విలువచేసే 150 మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తుందని అన్నారు. అంతేకాక నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.5250 చొప్పున హెక్టారుకు మెయింటెనెన్స్ కింద పెట్టుబడి అందజేసేలా కూటమి ప్రభుత్వం ఉద్యాన శాఖకు అనుసంధానించిందని పేర్కొన్నారు. సమావేశంలో అజంతా సోయా కంపెనీ ప్రాజెక్టు హెడ్ పాశం సుధాకరరెడ్డి, మేనేజర్ సర్తాజ్ బాషా, హార్టికల్చర్ అధికారి హనుమంతు నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దారు సలీమా

సారా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల

నాటు సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తహశీల్దారు షేక్ షలీమా సూచించారు. సారా మహమ్మారి మనకొద్దు అనే నినాదంతో నవోదయం కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎక్సైజ్ అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపిపి చిన్ని పోతుల హరిబాబు మాట్లాడుతూ గతంలో స్టువర్టుపురం, వెదుళ్ళపల్లి పరిసర గ్రామాల్లో నాటు సారా క్రయ, విక్రయాలు విచ్చలవిడిగా జరిగేవని అన్నారు. ప్రస్తుతం చాలావరకు అదుపులోకి వచ్చాయని అన్నారు. ఎక్సైజ్ సీఐ గీతిక మాట్లాడుతూ ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. మండలంలోని స్టువర్టుపురం, వెదుళ్ళపల్లి, బేతపూడి ప్రాంతాలు అనాదిగా నాటు సారాకు కేంద్రాలుగా ఉన్నాయని అన్నారు. నిత్యం స్టువర్టుపురం గ్రామంపై అనేక దాడులు జరుగుతున్నాయని, నాటు సారా తయారీదారులను అదుపులోకి తీసుకోవటం, కేసులు నమోదు చేయటం నిత్య కృత్యంగా జరుగుతుందని అన్నారు. అయితే ఈ విధానం మారాలని అన్నారు. ప్రజలందరిలో అవగాహన పెరగాలని అన్నారు.



శంకుస్థాపనలో ఎంపిపి లలిత కుమారి

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదపులివరు పంచాయతీలోని యాదవ వీధిలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సిసి రహదారి నిర్మాణానికి ఎంపిపి డివి లలిత కమారి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆ ప్రాంతంలో రహదారి అధ్వానంగా ఉండటంతో గ్రామస్తుల కోరిక మేరకు మండల పరిషత్తు నుండి రూ.10 లక్షలు నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో నిర్మించే సిసి రోడ్డు ఈ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. సకాలంలో పనులు పూర్తిచేసి గ్రామస్తులకు రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారునికి సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిరువీధుల ఉదయ్ భాస్కరి, మల్లేశ్వరరావు, బాలాజీ ఉన్నారు.

ఎమ్మెల్యే కొండయ్య చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - వేటపాలెం

చీరాల చేనేత కుప్పడం చీరకు జాతీయ పురస్కారంకు కృషి చేసిన ఎమ్మెల్యే కొండయ్య చిత్రపటానికి టిడిపి నాయకులు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు నాసిక వీరభద్రయ్య మాట్లా డుతూ ఎన్నో తరాలుగా ఎదురు చూస్తున్న చేనేత కార్మికులకు ఎమ్మెల్యే కృషి వల్ల గౌరవం దక్కిందని అన్నారు. కుప్పడం పట్టు చీరకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించడం శాసన సభ్యుని కృషికి నిదర్శనమని అన్నారు. మండలంలోని దేశాయిపేట రామానగర్ చౌడేశ్వరి దేవస్థానం వద్ద ఆయన చిత్రపట పాలాభిషేకం చేశారు. సంప్రదాయ మగ్గాలపై నేతన్నలు నేసిన 'చీరాల కుప్పడం' చీరలకు మార్కెట్లో ఈపాటికే కొంత డిమాండ్ ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా జాతీయ అవార్డు ప్రకటించడంతో మరింత ప్రాచుర్యం పొందుతుందని అన్నారు. చేనేతల శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుందని చెప్పారు. జాతీయ మార్కెట్లోనూ కుప్పడం చీరల ప్రత్యేకతను కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో పట్టు వస్త్రాల వ్యాపారుల్లో ఆనందాన్ని కళ్లారా చూడటానికే సభ నిర్వహించినట్లు చెప్పారు. చీరాలలో మాత్రమే దొరికే కుప్పడం పట్టు వస్త్రాలకు తనదైన ప్రత్యేకత



ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఉందని అన్నారు. వీటిని మగ్గాలపై మాత్రమే నేస్తారని తెలిపారు. ఎంతో నాణ్యతగా కలర్ ఫుల్గా ఉండే కుప్పడం పట్టు చీరలు తేలికగా ఉంటాయని అన్నారు. అందుకే వీటిని ధరించేందుకు మహిళలు ఉత్సాహం చూపుతారని అన్నారు. మిగిలిన ప్రాంతాల్లో ధర్మవరం వంటి పట్టు వస్త్రాలతో పోలిస్తే కుప్పడం పట్టుకు ఇంతటి పాపులారిటీ లభించడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, మాజీ ఎంపిటిసి సిద్ధి బుచ్చేశరరావు, వెంగళ భరత్ బాబు, ఆంజనేయులు. ఎర్రసు శివ నాగ మల్లేశ్వరి, బుర్ర కవిత, సయ్యద్ మహబూబ్, కర్ణ ప్రసాదు, పిచ్చుక సుబ్బారావు, మాజీ సర్పంచ్ లేళ్ల శ్రీధర్, వడగ రాజా పాల్గొన్నారు.

పెదపూడి రహదారికి మోక్షమెప్పుడు..?

ప్రజాశక్తి - అమృతలూరు

కూటమి ప్రభుత్వ పాలనలో అధ్వానంగా ఉన్న రహదారులు అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుంది. దీనిలో భాగంగా చెరుకుపల్లి నుండి తెనాలి వెళ్లే రహదారి మార్గంలో అమర్తలూరు నుండి కూచిపూడి వరకు రహదారి పెద్ద పెద్ద గుట్టలుగా మారింది. వాహనాల రాకపోకలకు ప్రమాద భరితంగా మారటంతో ఈ రహదారి అభివృద్ధికి నిధులు కేటాయించారు. గుత్తేదారులకు ప్రభుత్వం పనులు అప్పగించింది. ఈ రహదారిని అభివృద్ధి పరిచేందుకు గుత్తేదారు గత మూడు నెలల క్రితమే జెసిబిలతో పగలగొట్టి చదును చేశారు. దానిపై కంకర, డస్టును నింపారు. ఈ పని పూర్తి చేసి దాదాపు మూడు నెలలు అవుతున్నప్పటికీ గుత్తేదారు బిటి రోడ్డు నిర్మాణం చేపట్టకుండానే వదిలేశారు. దీనివలన డస్టు నింపిన రహదారి వాహనాల రాకపోకలకు మళ్లీ గుంటలు ఏర్పడి కంకర రాళ్లు పైకి లేచి వాహన చోదకులకు తీవ్ర ఆటంకంగా మారింది. అమృతలూరు నుండి కూచిపూడి వరకు 15 నిమిషాల్లో వెళ్లే ప్రయాణం ప్రస్తుతం అరగంటకు పైగా పడుతుందని, రహదారిపై లేచిన రాళ్లతో వాహనాల టైర్లు పగిలిపోతూ ప్రయాణం ప్రాణ సంకటకంగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు. మండల కేంద్రం అమర్తలూరుకు ఆయా గ్రామాల నుండి నిత్యం వివిధ పనులపై ప్రజలు వస్తూ ఉంటారు. అదే రీతిలో



అధ్వానంగా ఉన్న అమృతలూరు, పెదపూడి రోడ్డు

ఆయా శాఖల అధికారులు, సిబ్బంది కూడా ఇదే రహదారిపై ప్రభుత్వ కార్యాలయాల్లో విధుల నిర్వహణకు వస్తూ ఉంటారు. రహదారి అధ్వన్నంగా మారడంతో నిత్యం కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులకు ప్రయాణం భారంగా మారుతుందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రహదారులతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, కూటమి ప్రభుత్వం ప్రారంభంలో రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించిన దృష్ట్యా ఈపాటికే అనేక ప్రాంతాల్లో రహదారులు అభివృద్ధి చెంది రాకపోకలు కొనసాగించటానికి ఇబ్బంది లేకుండా ఉంటే కూచిపూడి, అమృతలూరు రహదారి మాత్రం ఎందుకు నిలిచిపోయిందో అర్థం కావడం లేదని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఈ రహదారిపై ప్రయాణిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి - చీరాల

నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం శాసన సభ్యులు కొండయ్య పర్యవేక్షణలో ప్రజా దర్బార్ స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎఎంసి ఛైర్మన్ కౌతరపు జనార్ధనరావు అన్నారు. ఎంఎల్ఎ కొండయ్య ఆదేశాల మేరకు ప్రజల నుండి వినతులు స్వీకరించినట్లు తెలిపారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం కోసం సిఫార్సు చేసినట్లు తెలిపారు. 129 అర్జీలు రాగా వాటిలో పెన్షన్ కోసం 29, ఇళ్ల స్థలాల కోసం 90, ఇతర సమస్యలపై 10 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గంజి పురుషోత్తం, గూడూరు శివరాం ప్రసాద్, ప్రసన్న పాల్గొన్నారు.

వెంకయ్య మాస్టర్ మృతి

ప్రజాశక్తి - పర్చూరు



వెంకయ్య మాస్టారు(ఫైల్)

మండలంలోని అన్నంభొట్ల వారిపాలెంకు చెందిన వంకాయ లపాటి వెంకయ్య మాస్టారు మృతి పట్ల పూర్వ విద్యార్థులు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన స్వగ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం అంత్య క్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వెంకయ్య మాస్టారు పర్చూరులోని వైఆర్ ఉన్నత పాఠశాల్లో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. వయోభారంతో తుది శశ్వాస విడిచారని బంధువులు తెలిపారు. వెంకయ్య మాస్టారు ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. వివాద రహితునిగా క్రమశిక్షణ, నిబద్ధతకు, మారుపేరుగా పాఠశాలలో పనిచేసి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి ఉదయ భాస్కర్, కె అజయ్ కుమార్, వైఆర్ హైస్కూలు బృందం, దాసరి వెంకటేశ్వర్లు మాస్టారు ఉన్నారు.



పంచాయతీ స్థలంలో అక్రమార్కుల మట్టి తొలిన మట్టి

స్థల ఆక్రమణపై అధికారుల కొరడా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరంలోని ఒకటో సచివాలయం, ఆరోగ్య కేంద్రం వద్ద బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణానికి తీర్మానించిన స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించగా అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. ప్రధాన రహదారి వెంట ఉన్న ఈ స్థలంలో ఇప్పటికే అధికారులు సచివాలయ భవనం, రైతు సేవా కేంద్రం, ఆరోగ్య కేంద్రంను గత ప్రభుత్వంలో నిర్మించారు. వీటి సమీపంలో ఉన్న మరో నాలుగు సెంట్ల స్థలంలో అప్పట్లో బల్క్ మిల్క్ సెంటర్ నిర్మించాలని పంచాయతీలో తీర్మానం చేశారు. సంబంధిత అధికారులకు నివేదికలు సమర్పిం చారు. గుట్టు చప్పుడు కాకుండా ఈ స్థలంలో మట్టి తొలించి దానిలో నిర్మాణాలు చేపట్టేందుకు బోర్లు తీసి పనులు ప్రారం భించే ప్రయత్నం చేశారు. పంచాయతీ కార్యదర్శి, విఆర్ఒ ఆ ప్రాంతానికి చేరుకొని అక్రమ నిర్మాణ పనులు శుక్రవారం అడ్డుకున్నారు. ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నోటీసులు జారీ చేయాలని తహశీల్దారు శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ ద్వారా సదరు వ్యక్తికి నోటీసులు జారీ చేసినట్లు కార్యదర్శి కోటేశ్వరరావు చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

భూమి దస్త్రాలతోనే

రెవెన్యూశాఖకు ప్రత్యేక గుర్తింపు : కలెక్టర్

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

భూమి దస్త్రాలతోనే రెవెన్యూశాఖకు ప్రత్యేక గుర్తింపు ఉందని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన రెవెన్యూ అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అవార్డులు, జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విజ్ఞానం పెంచుకుంటేనే రెవెన్యూశాఖ ద్వారా ప్రజలకు విశేష సేవలు అందించగలమని తెలిపారు. ప్రభుత్వ శాఖలన్నింటికీ మాత శాఖగా రెవెన్యూ శాఖ నిలుస్తుందన్నారు. రెవెన్యూ శాఖ పుట్టినరోజును ప్రభుత్వం అధికారికంగా జరుపుకోవడానికి అనుమతులు ఇవ్వడం సంతోష దాయకమన్నారు. 240 సంవత్సరాల క్రితం రెవెన్యూ బోర్డు ఏర్పాటు కాగా, ఆ రోజునే రెవెన్యూ డేగా పాటిస్తున్నట్లు చెప్పారు. విపత్తు సమయాలలో రెవెన్యూ శాఖ ఉద్యోగుల సేవలు వెల కట్టలేనివన్నారు. అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేసేది రెవెన్యూ శాఖ ఒకటేనన్నారు. నూతనంగా రెవెన్యూ ఉద్యోగం చేరే ఉద్యోగులకు చట్టాలపై కనీసం అవగాహన ఉండటం లేదన్నారు. విధుల నిర్వహణలో మరింత ప్రావీణ్యం పొందాలన్నారు. భూ సమస్యలపై, సర్టిఫికెట్స్ కోసం పేద ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు అర్జీలతో వస్తుంటారని, క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు వారి సమస్యలను సావధానంగా విని సత్వరం పరిష్కరించేలా అధికారులు పనిచేసినప్పుడే ప్రజల్లో రెవెన్యూ శాఖపై నమ్మకం పెరుగుతుందన్నారు. ఈనెలాఖరుకు ఉద్యోగ విరమణ చేస్తున్న తహశీల్దార్లు సీతారత్నం, త్రిపుర బాల సుందరమ్మ, వెంకటరత్నంను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్‌డిఒ పి. గ్లోరియా, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కనకరాజు, తహశీల్దార్లు కలెక్టరేట్ సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

యోగాను విజయవంతం చేయండి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఈనెల 21న నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగాను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఒంగోలు మినీ స్టేడియంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో శనివారం రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, బిఎన్.విజయకుమార్, నగర మేయర్ గంగాడ సుజాత, ఎస్‌పి దామోదర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా గురువు పతంజలి బాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, జిల్లా అధికారులతో కలిసి యోగాసానాలు వేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వైజాగ్‌లో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది ప్రజలు, ఒక లక్షా 50 వేల ప్రదేశాల్లో ఒకే సమయంలో యోగా సాధన చేయనున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలో 6,458 ప్రదేశాల్లో ఒకే సమయంలో యోగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు.

ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంతో యోగాపై అవగాహన

ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంతో యోగాపై ప్రజలలో అవగాహన కలిగిం చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు తెలిపారు. దేశంలో పుట్టిన యోగా ప్రాముఖ్య తను గుర్తించి ప్రధాని నరేంద్ర మోదీ కోరటంతో ఐక్యరాజ్య సమితి 2014 జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

నేటి దైనందిన జీవితంలో ఒత్తిళ్ళు, సమ స్యలను అధిగమించేందుకు యోగా దోహపడుతుందని సంతనూత లపాడు ఎమ్మెల్యే విజయకుమార్ తెలిపారు. ఆరోగ్యం, ఆశయం అభివృద్ధి సాధించాలంటే సిఎం చెప్పినట్లు ఆరోగ్యం బాగుంటేనే జీవితంలో ఏదైనా సాధించ వచ్చునన్నారు.

యోగాపై మహిళలకు అవగాహన అవసరం

మహిళలకు యోగ పట్ల అవగాహన కల్పించినట్లయితే ఆ కుటుంబం ఆరోగ్య కరంగా ఉండే అవకాశం ఉంటుందని ఎస్‌పి ఎఆర్. దామోదర్ తెలిపారు. 2047లో ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్‌ను సాధించాలన్న లక్ష్యంతో సిఎం రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర క్యాంపెయిన్‌ను నెల రోజుల పాటు నిర్వహించినట్లు తెలిపారు. ఈసందర్భంగా గాయకుడు నూకతోటి శరత్ కుమార్ రూపొందించిన యోగా గేయాన్ని ఆవిష్కరించి ఆలపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు ఆర్‌డిఒ లక్ష్మీ ప్రసన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు నారాయణ, శ్రీహరి, ఆయుష్ శాఖ ఆర్‌జెడి పద్మజాతి, డిఇఒ ఎ.కిరణ్ కుమార్, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ బి.రవి, స్టెప్ సిఇఒ పి. శ్రీమన్నారాయణ, డిఎస్‌డిఎ జి.రాజరాజేశ్వరి, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



యోగాసానాలు వేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, ఎస్‌పి దామోదర్, కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఆ జీవోలను వెనక్కి తీసుకోవాల్సిందే..

కలెక్టరేట్ వద్ద కార్మికసంఘాల నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పనిగంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొంచిన జీవోలను వెనక్కి తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ సిఐటియు, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో కల్టెరేట్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అనేక ఉద్యమాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పని నుంచి 10 గంటల పని విధానం అమలుకు జీవో జారీ చేసినట్లు తెలిపారు. ఇది కార్మికులను కార్పొరేట్లకు బానిసలుగా చేయడమేనని దుయ్యబట్టారు . మహిళల చేత నైట్ డ్యూటీలు చేయించాలని జీవో రూపొందించడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు పనిచేసే ప్రాంతాల్లో పగటిపూటే రక్షణ కరువవుతున్న తరుణంలో నైట్ డ్యూటీ పేరున జీవోలు ప్రవేశపెట్టడం సరైనది కాదన్నారు. ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ జీవోలు తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని కట్టుకొని 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసినట్లు తెలిపారు. ఇది కార్మికుల హక్కులను కాలరాసినట్లేనన్నారు. లేబర్ కోడ్స్ పేరుతో పని గంటల పెంపు , మహిళల చేత నైట్ డ్యూటీలు చేయించేందుకు నిర్దేశించిన జీవోలు కార్మిక వర్గ దోపిడీకి సంకేతమన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు నిర్వీర్యం, యూనియన్ రిజిస్ట్రేషన్‌కు ఆటంకాలు కల్పించటం తదితర సంస్కరణలను కేంద్రం చేపట్టిందన్నారు. గతంలో అనేకమంది పోరాడి సాధించుకున్న హక్కులను రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసే ప్రయత్నంలో ఉన్నాయని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు కార్పొరేట్స్‌కు తొత్తులుగా మారారని దుయ్యబట్టారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఇటీవల మహిళా విఆర్ఎలకు నైట్ డ్యూటీలు వేసినట్లు తెలిపారు. విఆర్ఎ సంఘం పోరాడి మహిళలకు నైట్ డ్యూటీ జీవో రద్దు చేయించినట్లు తెలిపారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.మోహన్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు ,మెడికల్ సేల్స్ అండ్ డిప్రజెంటేటివ్స్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.చిరంజీవి మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు చేపట్టిన ఉద్యమ స్ఫూర్తితోనూ, ఢిల్లీ రైతాంగ ఉద్యమ ఐక్యతతో ప్రతి ఉద్యోగి, కార్మికుడు సంఘటీతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.రమేష్ , డికె.రావు , హరిబాబు ,టి. మహేష్ ,తంబి శ్రీనివాసులు, ఎస్.రవి , టి.రాము ,పి.కల్పన, వి.మోజస్, వి.బాలకోటయ్య,వి.ఆంజనేయులు ,బి.సుబ్బారావు ,సయ్యద్ మున్వర్ బాషా , విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

నేటి నుంచి కేంద్రీయ విద్యాలయం పున: ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

కేంద్రీయ విద్యాలయాన్ని శనివారం నుంచి పున్నప్రారంభిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపల్ ఎం. మనీష్ కుమార్ తెలిపారు. వేసవి సెలవుల అనంతరం తిరిగి తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తరగతుల ప్రారంభం గురించి విద్యార్థులందరికీ సమాచారం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యాలయంలో సిబిఎస్‌ఇ సిలబస్‌తో బేసిక్ క్లాస్ నుంచి 10 వ తరగతి వరకు ఒక్కో సెక్షన్‌కు 40 మంది చొప్పున మూడేసి సెక్షన్లు, 11,12 తరగతులకు రెండేసి సెక్షన్లు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రైతుల వ్యక్తిగత హక్కులకు ప్రత్యేక చర్యలు

జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సంయుక్తంగా భూమిని కలిగి ఉన్న రైతులకు వ్యక్తిగత హక్కులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఇందులో భాగంగా ప్రకాశం జిల్లాలో జాయింట్ పట్టాదారుల భూములను వ్యక్తిగత హక్కుగా విభజించేందుకు 'సబ్ డివిజన్' డ్రైవ్‌ను ప్రారంభించినట్లు సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. జాయింట్ హక్కుదారులుగా ఉన్న భూములపై తరచూ వివాదాలు, రిజిస్ట్రేషన్ సమస్యలు, పథకాల లబ్ధిలో అడ్డంకులు తలెత్తుతున్న నేపథ్యంలో ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించిన గ్రామ సభలలో వచ్చిన అర్జీలను పరిశీలించి, కొన్ని జాయింట్ ఎల్‌పిఎంలను పరిష్క రించామన్నారు. 2025 జనవరిలో సబ్ డివిజన్ అప్లికేషన్ రుసుంను రూ. 500 నుంచి కేవలం రూ. 50 కనిష్ఠ సేవా ఛార్జీగా తగ్గించామన్నారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో 298 గ్రామాల్లో ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందన్నారు. ఈనెల 30నలోపు పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులకు సూచించామన్నారు. రూ. 50 కనిష్ఠ సేవా ఛార్జీ కూడా అదే తేదీ వరకు మాత్రమే వర్తించనుందన్నారు. రైతులు ఈనెల 30 లోపు తమ సంయుక్త భూములపై వ్యక్తిగత హక్కుల కోసం అవసరమైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సంయుక్త కలెక్టర్ సూచించారు. సబ్ డివిజన్ డ్రైవ్ ద్వారా రైతులు తమ భూమిపై పూర్తి హక్కు పొందుతారని, పభుత్వ పథకాల లబ్ధిని పొందగలుగుతారన్నారు. రిజిస్ట్రేషన్, రుణాలు పొందడం వంటి కార్యకలాపాల్లో సులభతరం అవుతుందన్నారు. జాయింట్ పట్టాదారులకు స్పష్టమైన వ్యక్తిగత హక్కులు కల్పించడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ సంయుక్త భూములపై వ్యక్తిగత హక్కుల కోసం సంబంధిత రెవెన్యూ కార్యాలయాలను సంప్రదించాలని జేసీ సూచించారు.